క్లుప్తంగా

బీసీ బాలికల హాస్టల్ తనిఖీ



హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్

మడకశిర: పట్టణంలోని బీసీ బాలికల హాస్టల్‌ను సోమవారం తహసీల్దార్ కరుణాకర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజన నాణ్యతను పరిశీలించారు. హాస్టల్‌లోని సమస్యలను విద్యార్థుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని వార్డెన్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్ ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా



మున్సిపల్ కమిషనర్ చాంబర్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

హిందూపురం: తమ సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ ఆఫీస్ ఎదుట ధర్నాకు దిగారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జడ్పీ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా 45 వేల మంది 25 ఏళ్లుగా పనిచేస్తున్నారన్నారు. అన్ని రకాల ధరలు పెరిగినా వాటికి అనుకూలంగా కార్మికుల జీతాలు పెంచడం లేదన్నారు. అనంతరం వివిధ సమస్యలపై కమిషనర్ శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో రాము, మల్లికార్జున, బాబయ్య, రామచంద్ర, గురున్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు ప్రారంభించిన మంత్రి సవిత



జెండా ఊపి బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నూతనంగా రెండు ఆర్టీసీ సర్వీసులను మంత్రి సవిత సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. మంత్రి స్వయంగా బస్సు నడిపి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా గమ్యస్థానాలకు చేర్చాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం నూతనంగా 400 ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఇందులో ఒక బస్సు పెనుకొండ నుంచి తిరుపతికి, మరో బస్సు పెనుకొండ నుంచి కర్నూలుకు తిరుగుతాయన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కర వేదికకు వివిధ సమస్యలపై 956 అర్జీలు వచ్చినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మీ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత ప్రజలు ఇచ్చిన అర్జీలను అధికారులకు అందజేశారు. అధికారులు అర్జీలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం ఉన్నత పాఠశాలను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ప్రస్తుతం జెడ్పీహెచ్ఎస్‌ను కళాశాలగా మర్చిన నేపథ్యంలో అధ్యాపకుల లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు.

పావగడలో ‘ గ్యాంగ్ వార్’ షూటింగ్



ఫైటింగ్ సీన్ చిత్రీకరిస్తున్న దృశ్యం

పావగడ: పట్టణంలో ‘గ్యాంగ్ వార్’ అనే కన్నడ చిత్రాన్ని చిత్రీకరిస్తున్నారు. రైన్ గేజ్ వార్డు రాయల్ చికెన్ సెంటర్ వద్ద ఫైటింగ్ దృశ్యాలను సోమవారం చిత్రీకరించారు. చిత్రాన్ని పూర్తిగా పావగడ పట్టణంలోనే చిత్రీకరిస్తామని డైరెక్టర్ అరవింద్ పేర్కొన్నారు.

అడుగుకో గండం

- అధ్వానమైన రోడ్లతో వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు
- పట్టించుకునేవారే లేరని ఆవేదన

సోమందేపల్లి/అమరాపురం: పెనుకొండ నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా మారాయి. ప్రధాన రహదారులు గుంతలమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సోమందేపల్లి, పరిగి, పెనుకొండ, రొద్దం, గోరంట్ల మండలాల్లోని రహదారులు దెబ్బతిన్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. మరోవైపు అమరాపురం మండలంలోని విరుపసముద్రం బార్డర్ నుంచి అమరాపురం వరకూ ఉన్న రోడ్డు గుంతలు, కంకర తేలడంతో ప్రయాణం నరక ప్రాయంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. అమరాపురం నుంచి విరుపసముద్రం వరకూ 8 కిలో మీటర్ల రోడ్డు కంకర తేలడంతో పాటు అడుగడుగునా గుంతలు ఏర్పాడ్డాయి. దీంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు.



అమరాపురం మండలం కళ్యాణదుర్గం రోడ్డులో గుంతలు పడిన దృశ్యం



సోమందేపల్లి మండలం చిన్న బాబయ్యపల్లిలో రోడ్డు దుస్థితి

ఎవరికీ పట్టడం లేదు



పాలసముద్రం వద్ద రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కనీసం ఆర్అండ్‌బీ అధికారులు సూచికలు ఏర్పాటు చేయడం లేదు. నిత్యం మంత్రులు, కలెక్టర్లు ఈ రోడ్లపైనే తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– ఓబుల్ రెడ్డి, పాలసముద్రం, గోరంట్ల మండలం

టిప్పర్ల దాటికి రోడ్డు ధ్వంసం



మా గ్రామ సమీపంలో ఉన్న క్వారీ నుంచి రాకపోకలు జరిపే టిప్పర్ల ధాటికి రోడ్డు ధ్వంసం అయింది. ఆ రోడ్డుపై కనీసం నడవాలంటే ఇబ్బందిగా ఉంటుంది. వర్షాకాలం వస్తే రోడ్డుపైనే వర్షపు నీళ్లు ఉంటున్నాయి. వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– గంగప్ప, చిన్న బాబయ్యపల్లి, సోమందేపల్లి మండలం

రోడ్డుపై వెళ్లాలంటే ఇబ్బంది



అమరాపురం నుంచి వలస గ్రామానికి రోజూ పాఠశాలకు వెళుతున్నా. అయితే రోడ్డు మొత్తం గుంతలమయంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా. ద్విచక్ర వాహనం తరచూ మరమ్మతుకు గురవుతోంది. మార్గ మధ్యలో పంక్చర్ అవుతుండటంతో నా బాధ దేవుడికే ఎరుక. వెంటనే అధికారులు రోడ్డుకు మరమత్తు చేయించాలి.

–రుద్రప్ప, ఉపాధ్యాయుడు, వలస, అమరాపురం మండలం

ఎప్పుడూ రిపేరీలే..



నేను ప్రైవేటు బస్సులో డ్రైవర్‌గా పని చేస్తున్నా. రోడ్డు కంకర తేలి, గుంతలు అధికంగా ఉండటంతో బస్సు తరచూ రీపేరీకి వస్తోంది. బస్సు బ్లేడులు పాడైపోతున్నాయి. అమరాపురం నుంచి విరుపసముద్రం వరకూ 8 కిలో మీటర్ల రోడ్డుపై ప్రయాణం చేయాలంటే నరకం చూస్తున్నట్లుంది. సంబంధిత అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలి.

–నాగరాజు, డ్రైవర్, అమరాపురం



పరిగి మండలం శ్రీరంగరాజుపల్లి నుంచి పరిగి వెళ్లే రోడ్డు ఇలా..



గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద ఇబ్బంది పడుతున్న వాహనదారులు



అమరాపురం: కంకర తేలిన విరూపసముద్రం రోడ్డు

ఇష్టారాజ్యంగా టపాసుల వ్యాపారం

- లైసెన్సులు చేతికి అందకనే దుకాణాల ఏర్పాటు
- జీరో బిజినెస్‌తో దండుకునేందుకు సిద్ధం
- అధికార పార్టీ నాయకులు కావడంతో నోరుమెదపని అధికారులు !

హిందూపురం: దీపావళి పండుగను పురస్కరించుకుని టపాసుల విక్రయాల కోసం స్థానిక ఎంజీఎం గ్రౌండ్‌లో సోమవారం దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 56 షాపుల మంజూరుకు దరఖాస్తు చేసుకోగా 54 వాటికి అనుమతులు వచ్చాయి. సీజన్ లైసెన్స్ తీసుకుని పండుగ రెండు, మూడు రోజుల వరకూ వ్యాపారాలు చేసుకోవడానికి జిల్లా అధికారులు అనుమతులు ఇస్తారు. అయితే ఈ తాత్కాలిక లైసెన్సులు ఇంకా చేతికి అందక ముందే ఫీజులు చెల్లించిన వ్యాపారులు దుకాణాలు వేసుకుని తమ సరుకులు ఏర్పాటు చేసుకుంటున్నారు. రెవెన్యూ అధికారుల సూచనల మేరకు 15 అడుగుల వెడల్పు, 20 పొడవుతో షెడ్లు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. షాపుల్లో కూడా కెపాసిటీకి మించి టపాసులు నిల్వ ఉంచకూడదు. అయితే కొందరు రాజకీయ పలుకుబడితో మూడు నాలుగు షాపులు ఏర్పాటు చేసుకుని టపాసుల వ్యాపారానికి తెరతీశారు. కుటుంబ సభ్యులు, బంధువుల పేరిట లైసెన్సు ఫీజులు కట్టి దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. రెండు దుకాణాలను కలిసి ఒక పెద్ద దుకాణం మార్చి పెద్దమొత్తం టపాసులు నిల్వలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగించడానికి సిద్ధమయ్యారు. వ్యాపారులందరికీ లాటరీ పద్ధతిలో దుకాణాలు ఏర్పాటు చేసినా ఎక్కువ దుకాణాలు పలుకుబడి ఉన్న వారికే దక్కాయని మిగిలిన వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా షెడ్లు ఏర్పాటు చేసుకోవడంతో వరుసగా ఏర్పాటైన షెడ్లలో కొన్ని పెద్దవి మిగిలినవి చిన్నవిగా మారిపోయాయని చెబుతున్నారు. కాగా ఈ తాత్కాలిక దుకాణాల్లో హెవీ ఎక్స్‌ప్లోజివ్ కాకుండా కెపాసిటి మేరకు 500 కేజీలు మించి టపాసులు నిల్వ చేసుకోవడానికి వీలులేదు. అయితే వ్యాపారంలో పోటీ ఉండటంతో అన్నిరకాల టపాసులు నిల్వచేస్తున్నారు.



ఎంజీఎం గ్రౌండ్‌లో ఏర్పాటు అవుతున్న టపాసుల దుకాణాలు

25 శాతానికి మాత్రమే బిల్లులు

టపాసుల విక్రయాల్లో కొందరు వ్యాపారులు జీరో బిజినెస్‌కు తెరలేపారు. రూ.లక్షలు ఆదాయాలు పొందుతున్నారు. టపాసుల విక్రయాలకు అనుమతుల సంబంధించిన రెవెన్యూ, ఫైర్, సేల్స్‌ట్యాక్స్, ఇలా ప్రతిశాఖకు ఈ వ్యాపారాలకు సహకారం అందిస్తున్నట్లు బహిరంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. హిందూపురం, పెనుకొండ, పరిగి తదితర ప్రాంతాల వ్యాపారులు తమిళనాడులోని శివకాశీ టపాసుల వ్యాపారుల నుంచి ఇక్కడకు వివిధ పద్ధతుల్లో తమ గోదాములకు టపాసులు దిగుమతి చేసుకుని నిల్వ చేస్తున్నారు. చెక్‌పోస్టులను దాటుకుని అడ్డదారుల్లో లారీల్లో తీసుకువచ్చి పెద్ద ఎత్తున నిల్వలు చేసుకున్నట్లు తెలిసింది. ఎక్కడైనా అధికారులు పట్టుకుంటే అక్కడే మామూళ్లతో సెటిల్ చేసుకుంటున్నారే విమర్శలు పెద్ద ఎత్తున ఉన్నాయి. హిందూపురం పరిసరాల ప్రాంతాల్లో గోదాములలో రూ.లక్షాది విలువచేసే టపాసులు నిల్వలు చేసినట్లు సమాచారం. ప్రధాన గోదాములతో పాటు రహస్యంగా ఇతర ప్రాంతాల్లో కూడా టపాసుల నిల్వలు ఉంటున్నట్లు తెలిసింది. సరుకుల్లో 25 శాతానికి మాత్రమే బిల్లులు చూపించి దాదాపు 75 శాతం రహస్యంగా నిల్వ చేసుకుని అమ్ముకుంటారని చెబుతున్నారు. కాగా ప్రస్తుతం విక్రయాలు చేస్తున్న వ్యాపారుల గోదాములు వారి వద్ద ఉన్న నిల్వలకు సంబంధించిన బిల్లులు, అనుమతి ఉన్న స్టాక్ వంటి వాటిని అధికారులు తనిఖీ చేసిన దాఖాలాలు ఏమీ లేవు. దీంతో ఈ జీరో వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిపోతోంది.

విద్యార్థుల ఇబ్బందులు పట్టవా?

- వెంటనే ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి
- తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఎస్ఎఫ్ఐ నిరసన

హిందూపురం టౌన్: డిగ్రీ, ఇంజినీరింగ్, బీ-ఫార్మసీ లాంటి ఉన్నతమైన విద్యలో పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థులు నిరసనకు దిగారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి మాట్లాడుతూ దాదాపుగా రూ.3,480 కోట్లు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉందన్నారు. మంత్రి లోకేష్ ఎన్నికలకు ముందుకు ఇచ్చిన హామీ మేరకు వెంటనే నిధులు విడుదల చేయించాలన్నారు. జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించాలని, హాస్టల్ విద్యార్థులకు నిత్యావసరాలు ధరలనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు.

పెనుకొండ రూరల్: విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ప్రధాన రహదారుల గుండా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయానికి చేరుకొని ఆర్డీఓ ఆనంద్ కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హర్షకుమార్ , భగత్, ముని, విద్యాసాగర్, హరి చైతన్య పాల్గొన్నారు.



మడకశిర తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

మడకశిర: మడకశిర ప్రభుత్వ బాలికల కళాశాల హాస్టల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల రెవెన్యూ కార్యాలయం వద్ద విద్యార్థులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ మాట్లాడుతూ మడకశిర బాలికల హాస్టల్లో వివిధ సమస్యలతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. వెంటే సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కరుణాకర్‌కు వినతిపత్రం సమర్పించారు.

విద్యుత్ చార్జీలు పెంచడమే దీపావళి కానుకా ?

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

అగళి: రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజలపై అదనపు సర్దుబాటు చార్జీల పేరిట రూ.6 వేల కోట్ల విద్యుత్ భారం మోపడం అన్యాయం. ఇదేనా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చే దీపావళి కానుక అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ప్రశ్నించారు. మండల కేంద్రంలోని జేసీఎస్ కన్వీనర్ మహేంద్రప్ప నివాసంలో సోమవారం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని ప్రచారం చేశారని, ఇప్పుడేమో నాలుగు నెలల్లోనే మాట మార్చి చార్జీల పెంపునకు అనుమతులు ఇవ్వడం దారుణమన్నారు. సీఎం చంద్రబాబు హామీలు నెరవేర్చకుండా ఎప్పుడూ జగన్‌పైనే బురదజల్లుతూ కాలం గడుపుతున్నారని దుయ్యబట్టారు. చార్జీల పెంపు నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు షర్మిలతో డైవర్షన్ పాలిటిక్స్ చేయిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో జేసీఎస్ కన్వీన్ మహేంద్రప్ప, మాజీ ఎంపీటీసీ శినప్ప, నాయకులు గంట నాగరాజు, కృష్ణన్న , కామరాజు, హనుమంతరాయప్ప, గోవిందప్ప పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయండి

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆధార్ అప్‌డేట్స్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ఆలుపనపల్లి, రత్నగిరి, చిగమతిఘట్ట, ఎం.రాయాపురం తదితర పాఠశాలలను సందర్శించారు. సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది సమన్వయంతో కేటాయించిన పాఠశాల వారీగా వివరాలను నమోదు వేగవంతం చేయాలన్నారు. ఇప్పటి వరకూ 300 మంది విద్యార్థులు మాత్రమే నమోదు చేశారని, మంగళవారం సాయంత్రంలోపు నమోదు ప్రక్రియను పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

మడకశిరలో రక్తదాన శిబిరం

మడకశిర: పట్టణంలోని యాదవ కల్యాణ మండపంలో సోమవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పోలీస్ అమరవీరుల జ్ఞాపకార్థం ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. రక్తదాతలకు ఎమ్మెల్యే పండ్లు, పండ్ల రసం అందించి అభినందించారు. పోలీసులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, సీఐలు రాజ్‌కుమార్, రామారావు, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయితీ పాలక వర్గ సమావేశాన్ని మంగళవారం జరగనున్నట్లు కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు జరిగే సమావేశం నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ నేతృత్వంలో జరుగుతుందన్నారు. వైస్ చైర్మన్లు, పాలక వర్గ సభ్యులు తప్పక హాజరుకావాలని కోరారు.

మీటర్లకు దరఖాస్తు చేసుకోండి

రొద్దం: మండల కేంద్రంలోని హౌసింగ్ కాలనీలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకొని గృహప్రవేశాలు చేసిన లబ్ధిదారులు విద్యుత్ మీటర్లకు దరఖాస్తు చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులు తెలిపారు. మీటర్లు లేకుండా విద్యుత్ వాడటం నేరమన్నారు. దరఖాస్తు చేసుకున్న వెంటనే మీటర్లను అందజేస్తామన్నారు.

16 అర్జీల స్వీకరణ

పెనుకొండ రూరల్: పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 16 అర్జీలు అందినట్లు డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. డివిజన్ వ్యాప్తంగా భూ తగాదాలు, పింఛన్, గృహ నిర్మాణాల కోసం వివిధ గ్రామాల ప్రజలు అర్జీలు ఇచ్చారన్నారు.

మొక్కలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

మడకశిర: పట్టణంలోని సీఎల్ఆర్‌సీ కార్యాలయం ఆవరణలో సోమవారం ఉపాధి హామీ పథకం కింద రైతులకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మొక్కలు పంపిణీ చేశారు. డ్రైలాండ్ హార్టికల్చర్ పథకం కింద అర్హులైన రైతులకు పండ్ల మొక్కలను అందించారు.

సజావుగా ఉగ్యోగుల సంఘం ఎన్నికలు

పావగడ: స్థానిక ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలు సోమవారం సజావుగా జరిగాయి. మొత్తం 10 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 22 స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. వీటిలో 11 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మరో ఐదు శాఖలకు సంబంధించి 11 స్థానాలకు ఎన్నికలు నిర్వహించినట్లు ఎన్నికల అధికారి ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు.

కాలువను పరిశీలించిన మంత్రి

సోమందేపల్లి: మండల కేంద్రంలోని హంద్రీ నీవా కాలువను మంత్రి సవిత సోమవారం పరిశీలించారు. సోమందేపల్లి చెరువు కింద పంటలు సాగు చేసే రైతుల పొలాలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని మంత్రి హామి ఇచ్చారు. ఇటీవల కురిసన వర్షాలకు హంద్రీనీవా కాలువ తెలగడంతో దాని మరమ్మతు గురించి అధికారులతో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హంద్రీనీవా ఈఈ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

పరిగి: బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని సేవామందిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని ఆర్డీటీ ఆడిటోరియంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్డీటీ డైరెక్టర్ పుష్పలత, రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహిళల రక్షణ, హక్కులు, విధులు, చట్టాలు తదితర అంశాలపై వివరించారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా

పెనుకొండ: ఇసుక ట్రాక్టర్ బోల్తాపడి ముగ్గురు కూలీలు గాయపడిన సంఘటన పెనుకొండ పట్టణ సమీపంలోని షీఫారం వద్ద సోమవారం చోటు చేసుకుంది. రొద్దం మండలం దండేపల్లి గ్రామానికి చెందిన పలువురు కూలీలు ట్రాక్టర్‌లో ఉదయం ఇసుకను పెనుకొండకు తరలిస్తుండగా మడకశిర ఘాట్‌రోడ్డులో ట్రాక్టర్ బోల్తాపడింది. ట్రాలీ తలకిందులు కావడంతో ఇసుక కింద చిక్కుకోవాల్సిన కూలీలు పక్కకు పడటంతో ప్రాణాలు దక్కించుకున్నారు. అయితే దండేపల్లికి చెందిన డ్రైవర్ నాగరాజుతో పాటు మరో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. రొద్దం పోలీసులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం వల్లనే ఆ మండలం నుంచి భారీ ఎత్తున ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని ఆ ప్రజలు ఆరోపిస్తున్నారు.

చిరుత దాడిలో మేక మృతి

రొళ్ల: మండల పరిధిలోని టీడీ పల్లిలో కాపరి రంగధామప్పకు చెందిన మేక చిరుత దాడిలో సోమవారం మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. రంగధామప్ప మేత కోసం మేకల మందను గ్రామ పొలి మేర వద్దకు ఉదయాన్నే తీసుకెళ్లాడు. అయితే సాయంత్రం తిరుగు ప్రయాణంలో పొదల చాటు నుంచి హఠాత్తుగా మేక మందపై చిరుత దాడి చేసింది. ఒక మేకను నోటితో పట్టుకుని పరుగులు తీస్తుండగా కాపరి మేకను చిరుత నుంచి విడిపించుకున్నాడు. అయితే అప్పటికే మేక చనిపోయింది. రూ.12 వేలు నష్టం జరిగిందని బాధిత కాపరి తెలిపారు. గ్రామం సరిహద్దు ఆనుకుని అటవి ప్రాంతం ఉండడంతో ఎక్కువగా చిరుత పులు సంచరిస్తున్నాయని వాపోయారు. సంబంధితశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కాపర్లు కోరుతున్నారు.

రక్తదానం.. ప్రాణదానం

హిందూపురం అర్బన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేయాలని డీఎస్పీ కేవీ మహేష్ పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు.

అపార్ ఐడీ నమోదు వేగవంతం చేయండి

మడకశిరరూరల్: మండలంలోని విద్యార్థులందరికీ అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) గుర్తింపు నంబర్ల నమోదును వేగవంతం చేయాలని ఎంఈఓ భాస్కర్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం ఆయన కేజీబీవీ, గుండుమల, పాపసానిపల్లి, హారేసముద్రం, నీలకంఠాపురం, గురుకుల పాఠశాల, సిద్ధగిరి తదితర పాఠశాలలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల అపార్ ఐడీ నమోదును పరిశీలించారు.

మద్య రహిత గ్రామంగా ‘డి.రొప్పం’

పావగడ: తాలూకాలోని నిడుగల్ హోబళికి చెందిన దేవరాయన రొప్పం గ్రామంలో మద్యాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇందులో భాగంగానే ప్రత్యేకంగా బోర్డును ఏర్పాటు చేయించారు. మద్యానికి బానిసలుగా మారి జీవితాలను ఎవరూ నాశనం చేసుకోకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. మద్యాన్ని ఎవరైనా విక్రయిస్తే గ్రామం నుంచి తరిమి కొడతామని హెచ్చరించారు. డీఎస్ఎస్ జిల్లా సంఘటన సంచాలకులు సీకే తిప్పేస్వామి, మాజీ సర్పంచ్ పరమేశ్, లక్ష్మమ్మ, గుండమ్మ, జయమ్మ, కమలమ్మ, సరస్వతి పాల్గొన్నారు.



మద్య నిషేధానికి మద్దతు తెలుపుతున్న దేవరాయన రొప్పం గ్రామస్తులు

ఆదర్శ ప్రాయుడు వాల్మీకి



హిందూపురం మండలం వెంకటాపురంలో వాల్మీకి చిత్రపటం ఊరేగిస్తున్న దృశ్యం



రొద్దం మండలం ఎం. కొత్తపల్లిలో జ్యోతులు మోస్తున్న మహిళలు

హిందూపురం: మహర్షి వాల్మీకి ఆదర్శప్రాయుడని వాల్మీకి సంఘ నాయకులు కొనియాడారు. సోమవారం చౌళూరు పంచాయతీలోని వెంకటాపురంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. మహిళలు జ్యోతులను సమర్పించారు. వాల్మీకి చిత్రపటాన్ని ప్రత్యేక వాహనంలో ఊరేగించారు.

రొద్దం: మండల పరిధిలోని ఎం కొత్తపల్లిలో వాల్మీకి జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకులు పెద్ద ఎత్తున మహర్షి వాల్మీకి విగ్రహం వద్ద పూజలు చేశారు. సాయంత్రం మహర్షి చిత్రపటాన్ని ఊరేగించారు. అలాగే రాచూరు గ్రామంలోనూ వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు.

రొళ్ల: మండల పరిధిలోని టీడీ పల్లిలో సోమవారం బోయ కులస్తుల ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి విగ్రహానికి మామిడి తోరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు ఎంతో నిష్ఠతో జ్యోతులతో గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకొచ్చి వాల్మీకి విగ్రహం వద్ద సమర్పించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.



టీడీ పల్లిలో వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

పావగడ: తాలూకాలోని దొమ్మతమరి గ్రామ పంచాయతీకి చెందిన మురారాయన హళ్లి గ్రామంలో మహర్షి వాల్మీకి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్ర పటాన్ని గ్రామం ప్రధాన వీధుల్లో వైభవంగా ఊరేగించారు. మహిళలు జ్యోతులు మోశారు.

గుడిబండ: మండల పరిధిలోని పూజార్లపల్లిలో వాల్మీకి జయంతి వేడుకలను వాల్మీకి సేవా సంఘం ప్రతినిధులు, స్థానిక వాల్మీకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకులు పాల్గొన్నారు.